జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 3 | జనవరి | 2026 • పేజీలు : 6



# ఈవీఎం గోడౌన్ తనిఖీ

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 2, ప్రజాజ్యోతి:** స్థానిక ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం

మిగతా 2 లో...

- త్వరలో జేబులకు చిల్లు పడనుందా!
- బెల్ట్ షాపుల కోసం ఏజెంట్ల నియామకం!
- సేల్స్ పెంచేందుకు వినూత్న ప్రయత్నం
- తనిఖీలు, కేసులు కాకుండా అభయం ఇస్తున్నారా?
- సిండికేట్ కాకపోవడంతో ఇలాంటి దందాకు శ్రీకారం
- సుమారుగా 20 రోజులు యంఆర్పి పై రూ. 10 తగ్గించి అమ్మకాలు
- మళ్ళీ యు టర్న్ తీసుకున్న వైనం
- ఎలాంటి వార్త వినాలో ఉత్కంఠ గా ఎదురు చూస్తున్న మందు బాబులు



6 లో..

# మందుబాబులకు... హెచ్చరిక కానుందా?

• ఇల్లందు, ప్రజాజ్యోతి

సాధారణంగా వ్యాపారస్తులు వారి వ్యాపారాన్ని పెంచుకోవడానికి అనేక రూపాల్లో కొనుగోలుదారులకు ఆఫర్లు ఇస్తుంటారు. దీంతోపాటు ప్రజల్లో వారి వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు అనేక విధాలుగా ప్రచారాలు నిర్వహించడం ఎప్పుడు జరిగే తంతు. ప్రస్తుతం ఏకంగా మద్యం దుకాణదారులు వారి వ్యాపారాన్ని విస్తరించుకోవడంతోపాటు సేల్స్ పెంచుకునేందుకు ఏకంగా బెల్టు షాపుల చుట్టూ నేరుగా ప్రదక్షిణలు చేసేందుకు ఏజెంట్లను నియమించడం అటు బెల్ట్ షాపు నిర్వాహకులు, ఇటు మందు బాబులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

## బాలకార్మిక నిర్మూలన...

# మనందరి బాధ్యత

- చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు
- జిల్లా ఎస్పి రోహిత్ రాజు



**కొత్తగూడెం క్రైమ్, జనవరి 2, ప్రజాజ్యోతి:** జనవరి 1 నుండి 31వ తారీఖు వరకు వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్ –XII లో భాగంగా వివిధ శాఖల అధికారులతో శుక్రవారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్పీ రోహిత్ రాజు సమావేశమయ్యారు. జిల్లాలోని ఐదు సబ్ డివిజన్లయిన కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఇల్లందు, మణుగూరు లో 05 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు కృషి జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆపరేషన్ స్మైల్ – XII పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కిరాణ, మెకానిక్ షాపులలో, హోటళ్లు, ఫ్యాక్టరీలలో, పనిచేస్తున్న బాల కార్మికులను, వదిలివేయబడిన, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం లేదా చైల్డ్ కేర్ హోమ్ కు పంపించడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరీ చేయిస్తే వారిపై నూతన చట్టాలను అనుసరించి క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పి హెచ్చరించారు. బాలల హక్కుల సంరక్షణ కోసం అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు

మిగతా 2 లో...

# విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే.... హెచ్ ఎంలపై శాఖాపరమైన చర్యలు

- ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాల్లో 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం
- పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు, వార్డెన్లతో సమీక్ష నిర్వహించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, జనవరి 2,ప్రజాజ్యోతి :** విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు తప్పిదాలకు పాల్పడితే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ హెచ్చరించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు

మిగతా 2 లో...

# ఇంటర్ మార్కులే... విద్యార్థి భవిష్యత్తును నిర్దేశిస్తాయి

- గిరిజన విద్యార్థులను ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి



**భద్రాచలం, జనవరి 2,ప్రజాజ్యోతి :** గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధిస్తేనే వారి భవిష్యత్తు సుస్థిరంగా ఉంటుందని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. ప్రిన్సిపాళ్లు ఈ దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించి వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని ఆయన సూచించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా గురుకుల పాఠశాలలు, కళాశాలలు,

మిగతా 2 లో...

## ఈవీఎం గోడౌన్ తనిఖీ

(మొదటి పేజీ తరువాయి...)

జరుగుతుందని, ఇందులో భాగంగా ఈవీఎం గోడౌను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా సీసీ కెమెరా గదిలో కెమెరాల పని తీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు, సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, పూసపాటి సాయి కృష్ణ పాల్గొన్నారు.

## బాలకార్మిక నిర్మూలన మనందరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి...)

చేపట్టాలని ఎస్పీ పేర్కొన్నారు.జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే 1098, డయల్ 100కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చిన్నపిల్లలు ముఖాల్లో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని భాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, డి డబ్ల్యూ ఓ స్వర్ణలత లెనినా, సి డబ్ల్యూ సి సభ్యులు అంబేద్కర్, సాదిక్ పాషా, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ షర్ఫుద్దీన్, డీసీపీవో హరి కుమారి, ఆపరేషన్ స్మైల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే హెచ్ ఎంలపై శాఖాపరమైన చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)

వార్డెన్లతో పాఠశాలల పర్యవేక్షణ, పదవ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్ నిర్వహణపై ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, కొన్ని విద్యాసంస్థల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో అనవసర పనులు చేయించుకుంటున్నారని, అలాగే కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులను విచక్షణరహితంగా శిక్షిస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హెచ్ ఎంలు, వార్డెన్లు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా స్టడీ అవర్స్ నిర్వహించి దానికి సంబంధించిన ఫోటోలు ప్రతిరోజూ తనకు పంపించాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు, హెచ్ ఎంలు పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు.గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారులను నియమించిన నేపథ్యంలో, స్పెషల్ ఆఫీసర్లు, హెచ్ ఎంలు తమకు కేటాయించిన పాఠశాలలను తప్పనిసరిగా వారానికి రెండుసార్లు ఉదయం, సాయంత్రం తనిఖీ చేసి విద్యార్థుల విద్యా పురోగతిని గమనించాలని అన్నారు. ప్రాథమిక తరగతుల పిల్లలతో పాటు పదవ తరగతి చదువుతున్న వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దాలని అన్నారు.ప్రాథమిక స్థాయిలో ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ తప్పనిసరిగా కొనసాగించాలని, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించారు. సర్వారం, ఎలిసిరెడ్డిపల్లి, కమలాపూర్, రేగళ్ల తండా, బొజ్జాయిగూడెం, పాల్వంచ, పాత ఇల్లందు, గొందిగూడెం, ఖమ్మం పరిధిలోని కొన్ని పాఠశాలల్లో గత సంవత్సరం పదవ తరగతి ఫలితాలు తక్కువగా వచ్చాయని గుర్తు చేస్తూ, ఈ విద్యాసంవత్సరంలో అలా జరగకుండా ప్రతి పాఠశాలలో కొత్త టైం టేబుల్, స్టడీ అవర్స్, మెనూ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యాబోధన, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించే స్పెషల్ ఆఫీసర్లు, హెచ్ ఎంలు, సబ్జెక్ట్ టీచర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే మూడు నెలల్లో పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పదవ తరగతి విద్యార్థులు శాతం శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు అవసరమైతే సంబంధిత హెచ్ ఎంలు పర్యవేక్షణలో పనులు చేపట్టాలని, ఉపాధ్యాయుల విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి విద్యాసంస్థలో పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఖమ్మం డీడీ విజయలక్ష్మి , ఏసీఎంఓలు రమేష్, శ్రీరాములు, ఏటిడీవోలు సత్యవతి, రాధమ్మ, భారతీదేవి, జీసీడీవో అలివేలు మంగతాయారు, ప్రత్యేక అధికారులు, హెచ్ ఎంలు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు



# ఇంటర్ మార్కులే... విద్యార్థి భవిష్యత్తును నిర్దేశిస్తాయి

(మొదటి పేజీ తరువాయి...)

ఈఎంఆర్ ఎస్ పాఠశాలలు, సీఓఈ, ఎస్ ఓఈ, యూఆర్ జేసీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు పదవ తరగతి మార్కుల ఆధారంగానే పై చదువులకు అవకాశాలు లభిస్తాయని, అందువల్ల పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. గురుకులాల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా చూడాలని, ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించి ఎంసెట్, నీట్, ఇతర పోటీ పరీక్షలు రాసి ఎంబిబిఎస్, ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో సీట్లు సాధించేలా ప్రోత్సహించాలని అన్నారు.ప్రతిరోజూ నిర్వహించే స్లిప్ టెస్టుల్లో విద్యార్థుల మార్కులు తగ్గకుండా పర్యవేక్షణ చేయాలని, గత సంవత్సరం సీఓఈ, ఎస్ ఓఈ, యూఆర్ జేసీ కళాశాలల్లో అనేక మంది విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ విద్యాసంవత్సరంలో అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి సెలవులకు వెళ్లిన విద్యార్థులు సెలవులు ముగిసిన వెంటనే కళాశాలలకు హాజరయ్యేలా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం, ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు ప్రతి విద్యాసంస్థలో అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచాల్సిందే గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ దండించరాదని, సమస్యలుంటే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పరస్పరం సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థులతో అనవసర పనులు చేయించకూడదని, అవసరమైతే 15 రోజులకు ఒకసారి శ్రమదానం నిర్వహించి విద్యాసంస్థలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ఆన్ లైన్ విధానంలో నిర్వహించనున్నందున అవసరమైన విద్యాసంస్థలకు కంప్యూటర్లు సరఫరా చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ సీఓ గురుకులం అరుణకుమారి, ఈఎంఆర్ ఎస్, ఎస్ ఓఈ, సీఓఈ, యూఆర్ జేసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఏవో నరేందర్ పాల్గొన్నారు

# యాసంగి పంటల సాగు, ఎరువుల లభ్యతపై సమీక్ష

- విలేకరులతో సహాయ వ్యవసాయ సంచాలకులు పి. రవికుమార్ సమావేశం
- ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పని సరి - వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి



**దమ్మపేట,జనవరి.2 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని మల్లారం రైతు వేదికలో యాసంగి పంటల సాగు పరిస్థితులు, ఎరువుల లభ్యతపై అశ్వరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. రవికుమార్ విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యాసంగి–2026 సీజన్ లో అశ్వరావుపేట డివిజన్ పరిధిలో వరి పంటను 9,144 ఎకరాల్లో, మొక్కజొన్నను 10,009 ఎకరాల్లో, వేరుశనగను 2,098 ఎకరాల్లో, పొగాకును 2,255 ఎకరాల్లో, ఇతర పంటలను 1,681 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం పంటల సాగు విస్తీర్ణం 25,198 ఎకరాలకు చేరిందని, ఇంకా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. యాసంగి సీజన్ కు అవసరమైన ఎరువులను ప్రైవేటు డీలర్లు, సహకార సంఘాల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా యూరియా ఎరువును పంటల పెరుగుదల దశలను బట్టి రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. గత నెల వరకు 8,200 బస్తాల యూరియా పంపిణీ చేయగా, ప్రస్తుతం 7,254 బస్తాలు స్టాక్ లో ఉన్నాయని వివరించారు. ప్రతి మండలంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పర్యవేక్షణ చేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి ఈ సీజన్ అంతా ఎరువులు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు.

అదేవిధంగా దమ్మపేట మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా లేదా మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు.

## రాష్ట్ర క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ గెలుపొందేన భద్రాద్రి జిల్లా అథ్లెట్లు

- విజయతలనుఅభినందించిన జిల్లా క్రీడా అధికారి ఎం.పరమధామరెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 2: ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అద్వర్యం లో హైదరాబాద్,గచ్చిబౌలి అథ్లెటిక్స్ స్టేడియం లో గురువారం ముగిసిన రాష్ట్రా క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ లో భద్రాద్రి జిల్లా అథ్లెట్లు 19మంది బాలికలు 10 కిలోమీటర్లు పరుగుపందెం విభాగంలో 25 పాయింట్లు సాధించి ఛాంపియన్ షిప్ గెలుపొందారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ శుక్రవారంతెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాల 10 కిలోమీటర్లు పరుగుపందెంలో పాల్వంచ కు చెందిన ఉషారాణి,అకంపాలెం కు చెందిన టబు, పాల్వంచ కు చెందిన హర్షిత, శ్యామల ,మొదటి 10 స్థానాలలో మెరుగయన ఫలితాలు సాధించి ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నారని అదేవిధంగా ద్రాచలం కు చెందిన సరిత, కాచనపల్లి కి చెందిన దుర్గ. బాలికల 2 కిలోమీటర్లు పరుగుపందెంలో ముడు, అయిదు స్తానాలు సాధించారని తెలిపారు.ఈ సందర్బముగ క్రీడాకారుల ను, కోచ్ లు నాగేందర్, యెర్రయ్య, నాగరాజు,శివ లను భద్రాద్రి జిల్లా క్రీడా అధికారి ఎం.పరంధామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. సారంగపాణి,జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు జి.రాధాకృష్ణ,జాతియ్ కోచ్ నాగపురి రమేష్,స్పోర్ఆథర్టీ కోచ్ శ్రీనివాస అభినందించారు.



# అన్ని కంపెనీల సోలార్లు అందుబాటులోకి

- **పాల్వంచలో సోలార్ షోరూమ్ ప్రారంభం**



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 2, ప్రజా జ్యోతి**

జిల్లా ప్రజలు విద్యుత్ ఖర్చును ఆదా చేసుకునే దిశగా ఇంటి పైకప్పుపై సోలార్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి కోసం పాల్వంచ కేంద్రంగా మహదేవ్ ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో సోలార్ షోరూమ్‌ను ఏర్పాటు చేశారు.శుక్రవారం ఈ షోరూమ్‌ను ఘనంగా స్థానిక అధికారులు,ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు.ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ యోజన కింద ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ పథకం ద్వారా నెలనెలా వచ్చే విద్యుత్ బిల్లులను జీరో స్థాయికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం 78 వేల రూపాయల వరకు సబ్సిడీని అందుబాటులోకి తెచ్చిందని నిర్వాహకులు నరేష్ పేటేటి వివరించారు.షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా లక్కీ డ్రా స్కీమ్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కేవలం 999 రూపాయలతో జాయిన్ అయితే జూన్ 2వ తేదీన జరిగే లక్కీ డ్రాలో మొదటి బహుమతి టాటా కారు,రెండో బహుమతి 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్ సెట్,మూడో బహుమతి ఎలక్ట్రిక్ స్కూటర్,నాలుగో బహుమతి ఎలక్ట్రిక్ సైకిల్,ఐదో బహుమతి వాటర్ ప్యూరిఫైయర్,అలాగే 20 మందికి కన్సోలేషన్ బహుమతులుగా వాటర్ జూసర్లు అందజేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా 5 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్‌ను బుక్ చేసుకున్న మొదటి 100 మందికి ఉచితంగా స్మార్ట్ సెమీ ఆటో కట్ ఆఫ్ / సీలింగ్ హ్యాండ్ అందజేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్యానెల్స్, సోలార్ పవర్ ఫెన్సింగ్, సోలార్ పవర్ పంప్ సెట్లు తమ ప్రత్యేకత అని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 99593 19282, 9705365111 నంబర్లను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పేటేటి నరసింహారావు, రామలక్ష్మి, పేటేటి నరేష్, కంబంపాటి సిరీష, కాసిన శ్రీను, తాటికొండ రామకృష్ణ, బొమ్మ కిరణ్, సంకటి శ్రీను, చిన్న శ్రీను, గుంటి అశోక్, ముల్లంగి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వద్దిరాజు, నామ, కవితలకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు







**ఇల్లందు, జనవరి 2, ప్రజాజ్యోతి:**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ యంపిలు నామ నాగేశ్వరరావు, మాలోత్ కవిత లను శుక్రవారం మాజీ వార్డు కౌన్సిలర్ జెకె శ్రీనివాస్, టీబిజికెఎస్ సెంట్రల్ నాయకుడు ఎస్. రంగనాథ్ లు మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కలను అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

## మడుగు సాంబమూర్తి జన్మదిన వేడుకలు



**ఇల్లందు టౌన్, జనవరి 2, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు కౌన్సిలర్ మడుగు సాంబమూర్తి జన్మదిన వేడుకలను శుక్రవారం ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఐఎన్టియుసి, స్టేషన్ బస్తి నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు సాంబమూర్తికి శాలువాలు, పూల బొకే లతో సన్మానించారు. రానున్న రోజుల్లో ఉన్నతమైన స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మహబూబ్, నాయకులు ఇమామ్, బత్తుల వెంకట నారాయణ, ఎస్. సరస్వతి, సిహెచ్. సునీత, జాఫర్, జావీద్, నవాజ్, వీరు, రామ్ సింగ్, ఖాజా పాల్గొన్నారు.

## నేడు గోదావరి నది హారతి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 2, ప్రజా జ్యోతి:**భద్రాచలంలో నేడు (పూర్ణిమ, శనివారం) నాడు సాయంత్రం 5:30 గంటల నుండి భద్రాచల క్షేత్రంలో గోదావరి నది హారతి కార్యక్రమం నిర్వహించబడుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో నదులు ప్రజల జీవనానికి ఆధారంగా నిలిచి, నాగరికత అభివృద్ధికి మూలాధారంగా పని చేశాయని, తరతరాలుగా నదులు ప్రజల జీవన విధానం, సంస్కృతి , పర్యావరణంతో ముడిపడి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించు ఉన్నాయని అన్నారు. అటువంటి నదుల్లో దక్షిణ భారతదేశంలో ప్రవహించే ప్రధాన నది గోదావరి.చరిత్రాత్మకంగా సాంస్కృతికంగా విశిష్టత కలిగిన గోదావరి నది తీరప్రాంతాలు అనేక సంప్రదాయాలు, కథనాలకు కేంద్రంగా నిలిచాయ నీ భద్రాచలం ప్రాంతం కూడా గోదావరి నదితో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉండి, కాలక్రమేణా ఒక ప్రముఖ సాంస్కృతిక , ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు, ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఏరు – ది రివర్ ఫెస్టివల్" లో భాగంగా గత శనివారం నుండి గోదావరి నదికి నది హారతి కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నది హారతి కార్యక్రమాన్ని ఇకనుండి ప్రతి వారం భద్రాచలంలో నిర్వహించనున్నట్లు పౌరుల అభిప్రాయం మేరకు 03.01. 2026 రోజున , వచ్చే ప్రతి శనివారం నిర్వహించాలని పేర్కొన్నారు. భద్రాచలం ప్రాంతంలో ప్రవహించే గోదావరి నది ఔన్నత్యాన్ని ప్రజలకు మరింతగా తెలియజేయడంతో పాటు, నది ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రజలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని, గోదావరి నది సంరక్షణ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## ధనుర్మాస సారెతో ఘనంగా గోదాదేవి అమ్మవారి పూజలు

- **గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ధనుర్మాస సారె కార్యక్రమం**





**అన్నపురెడ్డిపల్లి, జనవరి 2, ప్రజా జ్యోతి :**అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని అన్నపురెడ్డిపల్లి గ్రామంలో గోదాదేవి అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా సారె సమర్పించే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.అన్నపురెడ్డిపల్లి మండల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద కార్యక్రమం ప్రారంభమై, అక్కడి నుంచి మహిళా భక్తులు మేళతాళాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా నడుచుకుంటూ వెంకటేశ్వర స్వామి బాలాజీ ఆలయానికి చేరుకొని అక్కడ ఉన్న గోదాదేవి అమ్మవారికి ధనుర్మాస సారెను పెద్ద ఎత్తున సమర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లకావతు లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఆలయ ఈవో, శివాలయ ఆలయ చైర్మన్, వికాస్ తరంగణి సభ్యులు, రామాలయ సేవా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ధనుర్మాస ప్రాధాన్యతను తెలియజేస్తూ భజనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గోదాదేవి అమ్మవారి ధనుర్మాస సారె కార్యక్రమం గ్రామ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు గ్రామ ఐక్యతను మరింత బలపరుస్తాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ధార్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించాలని గ్రామస్తులు తెలిపారు.

## యూరియా యాసంగి పంటకు సరిపోను ఉన్నది

- **జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**



**టేకులపల్లి, జనవరి02,ప్రజా జ్యోతి:** యాసంగి పంటకు యూరియా ఇబ్బంది లేకుండా సరిపోను ఉన్నదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబురావు అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టేకులపల్లి మండలంలో రైతులు యాసంగి పంట మొక్కజొన్న10 వేల ఎకరాల విస్తీరణలో సాగు జరుగుతుందని వారు తెలిపారు.వేరే ఇతర పంటలు మూడువేల ఎకరాల సాగు జరుగుతుందని తెలియజేశారు. ఈ యాసంగికి డిసెంబర్ నాటికి 39 వేల ఎనిమిది వందల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని తెలిపారు. రిక్వైర్మెంట్ వచ్చేసి40వేల మెట్రిక్కి 39800 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందే. యాసంగికి 27273 మెట్రిక్ అవసరమైతే, ఇప్పటివరకు వచ్చినది 16161 మెట్రిక్ టన్నులు దిగుమతి జరిగింది అని తెలిపారు. పాత బ్యాలెన్స్ 992, మొత్తం కలిపి 17153 మెట్రిక్ టన్నులు ఇందులో సేల్ అయింది. 9967 మెట్రిక్ టన్నులు, బ్యాలెన్స్ వచ్చి ప్రస్తుతనాకి 7186 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నది అని ఆయన తెలిపారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని వారు తెలిపారు.ప్రతి రైతుకు యూరియా అందిస్తామని తెలిపారు.ప్రతి రైతుకు ఒక ఎకరానికి ఒక బస్తా చొప్పున ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మండలలో ప్రైవేటు షాపులలో కూడా యూరియా బస్తాలు లభిస్తాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ లాల్చంద్, ఏవో అన్నపూర్ణ, మండల ఏఈవోలు, సొసైటీ సీఈఓ చారి, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ డైరీ, అధ్యాపక దర్శిని, క్యాలెండర్ ను ఆవిష్కరణ

- **జడ్పీహెచ్ఎస్ సులానగర్ ప్రధాన ఉపాధ్యాయులు దేవదాస్**

**టేకులపల్లి,జనవరి02, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర టీఎస్ యుటిఎఫ్ డైరీ,అధ్యాపక దర్శిని, క్యాలెండర్ను జడ్పీహెచ్ఎస్ సులానగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి. దేవదాస్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరీ తో పాటు ఉపాధ్యాయులకు అందించిన అధ్యాపక దర్శిని ఉపాధ్యాయులకు సమగ్ర మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని వారు అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు శ్రద్ధగా అధ్యయనం చేసి విద్యా వ్యవస్థ అభివృద్ధికి సేవలందించాలని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ సింగ్ ,మండల అధ్యక్షులు హరికుమార్ , ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఉపాధ్యక్షులు మాన్సింగ్,రాజు, లక్ష్మీనారాయణ,వెంకటేశ్వర్లు,పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు లక్ష్మయ్య , మురళీధర్ రావు ,సునీత, దీపా , శ్రీలక్ష్మి , స్వరూప, మమత ,శ్రీను, సిఆర్పి బాలాజీ పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వాములకు అన్నదానానికి రూ.10 వేల వితరణ

- సర్పంచ్ రుక్మా



**పాల్వంచ (టౌన్ ),జనవరి 02(ప్రజా జ్యోతి):**పాండురంగపురం తండా సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా గెలుపొందితే పాండురంగపురం తండాలోని అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమానికి రూ.10,000 విరాళం అందజేస్తానని హామీ ఇచ్చిన అజ్మీరా రుక్మా తన మాటను నిలబెట్టుకున్నారు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన రుక్మా,ఇచ్చిన హామీ ప్రకారం అప్పయ్య స్వాముల మండపాన్ని సందర్శించి అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమానికి రూ.10,000 నగదు విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు,భక్తులు రుక్మా సేవాభావాన్ని కొనియాడుతూ అభినందనలు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రుక్మా ముందుంటారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

## మంత్రి, ఎమ్మెల్యే, ముఖ్య నేతలను కలిసిన బిసి నేతలు



**ఇల్లందు, జనవరి 2, ప్రజాజ్యోతి:**బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కోసం సహకరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బిసి జెఏసి కన్వీనర్ మడత వెంకట్ గౌడ్, రాష్ట్ర జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ల ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

## తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**భద్రాచలం, జనవరి 2,ప్రజాజ్యోతి :**తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ 2026 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర క్యాలెండర్‌ను భద్రాచలం సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌ను భద్రాచలం ఏటీఓ విష్ణు రావు, ఎస్‌టీఓ సుభద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, గౌరవ అధ్యక్షులు చంద్ర సుబ్బయ్య దరి, సహాధ్యక్షులు హరినాథ్, ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్, మల్యాల కిషన్‌రావు, ఎన్. జగన్మోహన్‌రావు, ఎన్.వి. నారాయణరావు, బంధు నరసింహారావు, పంపన సత్యనారాయణ, కొండలరావు, కార్యదర్శి ఐ.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే బంగారు భవిష్యత్తు

- కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్
- ఐదోరోజు ఎన్.ఎస్.ఎస్ శిబిరం

**చర్ల, జనవరి 02(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం చర్ల ప్రభుత్వం జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ జాతీయ సేవ పథకం ప్రత్యేక శీతాకాల శిబిరం 5వ రోజున సుందరయ్య కాలనీలో ఎన్.ఎస్.ఎస్ 50 మంది వాలంటీర్లు శ్రమదానం చేశారు. సుందరయ్య కాలనీ నుండి కొయ్యూరు వెళ్లే రహదారికి ఒక కిలోమీటరు రెండు వైపులా చెత్తాచెదారాన్ని తొలగించి పిచ్చి మొక్కలను ముళ్ళ పొదలను తొలగించి శుభ్రం చేశారు మధ్యాహ్నం రెండు గంటల నుండి ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీ. ఎన్. నరేందర్ విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన తోటమల్ల సురేష్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ జెడ్పి.హెచ్.ఎస్ తేగడా జాతీయ అవార్డు గ్రహీత మాట్లాడుతూ చదువును ఇష్టపడి చదవాలి అని విద్యార్థులు ప్రతిరోజు కాలేజీకి హాజరు అయ్యి తప్పకుండా పరీక్షలలో మంచి మార్కులను పొందాలి అని రాబోయే పరీక్షలను మంచి సమయపాలనతో చదివి మంచి మార్కులను తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విచ్చేసిన టి. సురేష్ కి సన్మానించారు . ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ తో పాటు ఎన్.ఎస్. ఎస్ పి. ఓ. జి. సుధాకర్ , శెట్టి ప్రసాద్, కృష్ణమోహన్, వీరభద్రం, విజయ ,రమేష్ ,విక్రమ్, సమ్మయ్య , ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు







## అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్‌గా కొత్తగూడెం గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల



**భద్రాచలం, జనవరి 2,ప్రజాజ్యోతి :**కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌లో కొత్తగూడెంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం ఎంతో హర్షణీయమని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.వరంగల్‌లో డిసెంబర్ 19, 20 తేదీలలో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ పోటీల్లో బీసీఎం–5 విభాగానికి చెందిన విద్యార్థినులు ప్రతిభను చాటుతూ ఓవరాల్ ఛాంపియన్షిప్‌ను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీల్లో పాల్గొన్న కోచ్‌లు, క్రీడాకారులను పీవో బి. రాహుల్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ, కష్టపడి శ్రమించి పట్టుదలతో ఆడి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం ద్వారా గిరిజన సంక్షేమ శాఖతో పాటు ఐటీడీఏకు మంచి పేరు తీసుకువచ్చారని అన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కళాశాల ప్రతిష్ఠ మరింత పెరిగిందని తెలిపారు.ఈ విజయం ఇతర విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలవాలని, తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పోటీపడి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ గురుకులం అరుణకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, పీడీ శ్వేత, ఏవో నరేందర్, గురుకులం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో పేకాటపై పోలీసుల దాడి

- పేకాటపై కఠిన చర్యలు - ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి



**దమ్మపేట,జనవరి.2 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని గురువాయిగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై శుక్రవారం పోలీసులు దాడి నిర్వహించారు.దమ్మపేట ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, 11,310 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించి ఇంకా ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి తెలిపారు.

## మహిళల చేతుల్లో నాయకత్వం

- ఇల్లందులో వాసవి క్లబ్ వనితా క్రౌన్ గా ఆవిర్భావం



**ఇల్లందు, జనవరి 2, ప్రజాజ్యోతి:**ఇల్లందు పట్టణంలో మహిళా సాధికారతకు మరో కీలక అడుగుగా వాసవి క్లబ్ వనితా క్రౌన్ ఘనంగా ఆవిర్భవించింది. శుక్రవారం స్థానిక ఉమా గణపతి ఆలయంలో వాసవి వనితా క్లబ్‌ను అధికారికంగా ప్రారంభించారు. నూతన వనితా క్లబ్ అధ్యక్షురాలిగా కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల వాణి, కోశాధికారిగా సముద్రాల ఉషారాణి లను ఎన్నుకున్నారు. నూతన క్లబ్ ప్రారంభానికి సంబంధించిన ఫారం నంబర్ 1020ను ఫౌండర్, అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి రాచర్ల వాణి, కోశాధికారి సముద్రాల ఉషారాణి లతో కలిసి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్స్,ఇంటర్నేషనల్ కార్పొరేట్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ వివిఎన్. సిల్వర్ స్టార్ చిదిరాల లింగయ్య, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వివిఎన్. సిల్వర్ స్టార్ అర్వపల్లి రాధాకృష్ణ లకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం హర్షణీయమని, వాసవి క్లబ్ ఇల్లందుకు ఘన చరిత్ర ఉందని, వనితా క్లబ్ ద్వారా కూడా ఇంటర్నేషనల్ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన అధ్యక్షురాలు కటకం అలేఖ్య మాట్లాడుతూ వాసవి క్లబ్ వనితా క్రౌన్‌కు తొలి అధ్యక్షురాలిగా అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఇల్లందు వాసవి క్లబ్ చేస్తున్న సేవల నుంచి ప్రేరణ పొంది మేము కూడా సేవా రంగంలోకి అడుగుపెట్టామని, ఇల్లందు మహిళలందరి సహకారంతో ఉత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఇంటర్నేషనల్ స్థాయిలో ఇల్లందు పేరును ప్రతిష్టాత్మకంగా నిలబెడతామని పేర్కొన్నారు. కొత్త క్లబ్‌కు ఆర్థిక సహకారం అందించిన అర్వపల్లి రాధాకృష్ణ దంపతులకు పుల్లూరి సతీష్ కుమార్, యెలుగూరి మధుబాబు, సైఫా రాజశేఖర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ టిఎఫ్ డైరీఆవిష్కరణ

**భద్రాచలం ,జనవరి 2,ప్రజాజ్యోతి :** భద్రాచలం మండల కమిటీ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన టీఎస్ యుటిఎఫ్–టిఎఫ్ డైరీని మండల విద్యాశాఖ అధికారి తోటపల్లి రమ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డైరీతో పాటు ఉపాధ్యాయులకు అందించిన 'అధ్యాపక దర్శిని' పుస్తకం ఉపాధ్యాయులకు సమగ్ర మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు దీనిని శ్రద్ధగా అధ్యయనం చేసి విద్యా వ్యవస్థ అభివృద్ధికి మరింత సేవలందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ, 2026 సంవత్సరం టీఎస్ యుటిఎఫ్‌కు పోరాటాల సంవత్సరమని తెలిపారు. రాబోయే కాలంలో సర్వీస్ నిబంధనలు రూపొందించాలని, ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఆమోదయోగ్యమైన పీఆర్‌సీ ప్రకటించాలని, రిటైర్ అయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ మంజూరు చేయాలని, బకాయి ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించడంలో ఇలాంటి డైరీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాజా శ్రీనివాస్, మండల అధ్యక్షులు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, సాంస్కృతిక కార్యదర్శి పూసం భారతి పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ పూర్ణతో పాటు ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రజిని, సుజాత, పరిణిత, మమత, అమీనాభి, రమాదేవి తదితరులు పాల్గొని డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం

- **వాహన చోదకులకు పువ్వులు అందజేసి అవగాహన కల్పించిన ఎంవీఐ**



**భద్రాచలం, జనవరి 2,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) సంగం వెంకట పుల్లయ్య వాహన చోదకులకు పువ్వులు అందజేస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలకు సంబంధించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించినప్పుడే వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి వాహన చోదకుడి బాధ్యత ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు.అనంతరం ఎంవీఐ కార్యాలయంలో నిర్వహించిన వాహన చోదకుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ప్యూసీ సర్టిఫికెట్ వంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు ఎల్లప్పుడూ కలిగి ఉండాలని తెలిపారు.అలాగే మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. భద్రతా నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితేనే కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలమని, ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎఎంవీఐ) ఎం.డి. ఫరూక్, బీఆర్ రెడ్డి, రవితో పాటు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దమ్మపేటకు తహసిల్దారు ఎక్కడ? తహసిల్దారు లేక ప్రజల కష్టాలు

- **దమ్మపేటకు పూర్తి స్థాయి తహసిల్దారు కావాలి - బీజేపీ పార్టీ డిమాండ్**



**దమ్మపేట,జనవరి. 2 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలానికి పూర్తిస్థాయి తహసిల్దారు ను వెంటనే కేటాయించాలని దమ్మపేట మండల బీజేపీ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. చాలా కాలంగా దమ్మపేట మండలంలో స్థానికంగా తహసిల్దారు అందుబాటులో లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రస్తుతం తహసీల్దార్ లేక చాలా రోజులు అవుతోందని, ఇక్కడికి నియమితులైన తహసిల్దారు కొద్ది రోజుల్లోనే బదిలీ కావడం లేదా వేరే చోటుకు మార్చడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.మంత్రి సొంత మండలంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం బాధాకరమని, ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ దమ్మపేట మండలాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు, మంత్రులు తక్షణమే స్పందించి దమ్మపేటకు పూర్తి స్థాయి ఎమ్మార్వోను నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు తంబళ్ల రవి, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపూళ్ల శ్రీనివాసరావు, కొలికపోగు ముసలయ్య, పసుపులేటి నాగరాజు, సోయం వెంకట్, మహిళా నాయకులు కారం రత్నకుమారి, ఆళ్ల సుజాత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## సమస్య చెప్పారు....పరిష్కరించారు

- **సర్పంచ్ చొరవతో తీరిన లికేజ్ సమస్య**



**ములకలపల్లి జనవరి 02, ప్రజాజ్యోతి :** జగన్నాధపురం పంచాయతీ పరిధిలోని చింతపేట గ్రామంలో వాటర్ ట్యాంక్ సమీపంలో గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న లీకేజీ సమస్యను శుక్రవారం సర్పంచ్ కుంజా వినోద్ పరిష్కరించారు. లీకేజీ కారణంగా ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి, దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల పెరుగుదలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను వార్డ్ మెంబర్ సున్నం మంగ సర్పంచ్ కుంజా వినోద్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం స్వయంగా పర్యవేక్షిస్తూ మరమ్మత్తులు చేయించారు. దీర్ఘ కాలంగా ఉన్న సమస్య పరిష్కారమైనందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కూరం రామకృష్ణ, సున్నం నాగేష్, పంచాయతీ సిబ్బంది మరీదు రామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై చర్యలు



**దమ్మపేట,జనవరి 2 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని చీపురుగూడెం గ్రామ శివారులో అక్రమ ఇసుక రవాణా ఘటన వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీ ఒకటి రోడ్డుపై ఇసుకను అన్లోడ్ చేసి వెళ్లిపోయినట్లు దమ్మపేట పోలీసులకు సమాచారం అందింది.సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, రోడ్డుపై ఇసుక కుప్పలు ఉన్నట్లు గుర్తించారు. అయితే, సంబంధిత లారీ అక్కడి నుంచి పరారైనట్టు తేలింది.ఈ విషయాన్ని వెంటనే దమ్మపేట తహసీల్దార్‌కు తెలియజేయగా, రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమంగా అన్లోడ్ చేసిన ఇసుకను సీజ్ చేశారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన లారీ రిజిస్ట్రేషన్ నంబర్ గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సంబంధిత లారీ యజమాని, డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు విచారణ కొనసాగుతోందని దమ్మపేట పోలీసులు తెలియజేశారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు

- **విఓఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి**
- **ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద**

**ములకలపల్లి, జనవరి 02, ప్రజాజ్యోతి:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సెర్ఫ్ లో పనిచేస్తున్న విఓఏలకు రూ 18 వేల వేతనం ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ సీఎం రేవంత్ రెడ్డి ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ముదిగొండ మహాలక్ష్మి అధ్యక్షతన ఏఐటీయూసీ అనుబంధ విఓఏ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. గత 20ఏళ్ళ నుంచి సెర్ఫ్ లో పనిచేస్తున్న వివోఏలు రూ 5వేల తో కాలం వెళ్లబుచ్చుతున్నారని, డ్వాక్రా గ్రూప్ సంఘాల అభివృద్ధి లో కీలక పాత్ర పోషిస్తున్న విఓఏలు చాలీచాలని వేతనంతో కుటుంబం పోషణ భారంగా మారిందన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేసి రూ 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ సంఘం నాయకులు దాసం కనక లక్ష్మి, ఏలూరి దుర్గా, ముదిగొండ మహాలక్ష్మి, తానం సత్యనారాయణ,సఫియా, లక్ష్మికుమారి, విజయ్, కుమారి, తదితరులు.పాల్గొన్నారు.




## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యుగంధర్–రామకృష్ణలకు ఘన సన్మానం

- **అండగా ఉంటానని దారా యుగంధర్ హామీ**





**దమ్మపేట,జనవరి. 2 (ప్రజాజ్యోతి):** దమ్మపేట ఆటో యూనియన్ అధ్యక్షుడు సంకు రమేష్ అధ్యక్షతన శుక్రవారం మాజీ వైస్ ప్రెసిడెంట్ దారా యుగంధర్ , పెద్ద గొల్లగూడెం బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్, ఆటో యూనియన్ నేత ముత్తిని రామకృష్ణ లను ఘనంగా సత్కరించారు.ఆటో యూనియన్‌కు వారు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ, యూనియన్ నాయకులు శాలువాలతో కప్పి సన్మానం చేశారు.ఈ సందర్భంగా దారా యుగంధర్ మాట్లాడుతూ... ఆటో కార్మికుల కష్టసుఖాలు నాకు తెలుసని , యూనియన్ సభ్యులకు ఏ ఆపద వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముత్తిని రామకృష్ణ తనను సన్మానించినందుకు యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మౌలాలి, హరి, రాంబాబు, బాబురావు, శ్రీరామ్మూర్తి, శివ తదితర ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



- త్వరలో జేబులకు చిల్లు పడనుందా!
- బెల్ట్ షాపుల కోసం ఏజెంట్ల నియామకం!
- సేల్స్ పెంచేందుకు వినూత్న ప్రయత్నం
- తనిఖీలు, కేసులు కాకుండా అభయం ఇస్తున్నారా?
- సిండికేట్ కాకపోవడంతో ఇలాంటి దందాకు శ్రీకారం
- సుమారుగా 20 రోజులు యంఆర్పి పై రూ. 10 తగ్గించి అమ్మకాలు
- మళ్ళీ యు టర్న్ తీసుకున్న వైనం
- ఎలాంటి వార్త వినాలో ఉత్కంఠ గా ఎదురు చూస్తున్న మందు బాబులు

# మందుబాబులకు... హెచ్చరిక కానుందా?


● ఇల్లందు, ప్రజాజ్యోతి

**సాధారణంగా వ్యాపారస్తులు వారి వ్యాపారాన్ని పెంచుకోవడానికి అనేక రూపాల్లో కొనుగోలుదారులకు ఆఫర్లు ఇస్తుంటారు. దీంతోపాటు ప్రజల్లో వారి వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు అనేక విధాలుగా ప్రచారాలు నిర్వహించడం ఎప్పుడు జరిగే తంతు. ప్రస్తుతం ఏకంగా మద్యం దుకాణదారులు వారి వ్యాపారాన్ని విస్తరించుకోవడంతోపాటు సేల్స్ పెంచుకునేందుకు ఏకంగా బెల్టు షాపుల చుట్టూ నేరుగా ప్రదక్షిణలు చేసేందుకు ఏజెంట్లను నియమించడం అటు బెల్ట్ షాపు నిర్వాహకులు, ఇటు మందు బాబులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది.**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన మద్యం పాలసీ విధానంతో డిసెంబర్ ఒకటో తేదీ నుండి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇల్లందులో ఎనిమిది షాపులు ఉండగా వీటిలో మొదట గతంలో ఇక్కడ సిండికేట్ గా వ్యవహరించిన వ్యక్తికి 3 షాపులు రాగా, కాలక్రమేన మరో షాపు ఆయన పేరుతోనే మొత్తం 4 వైన్స్ షాపులు కొనసాగుతున్నాయి. మిగిలిన నాలుగు షాపులను దక్కించుకున్న వారు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటిలాగే మద్యం సిండికేట్ ను కొనసాగించాలనుకున్న పాత సిండికేట్ నిర్వాహకుడికి ఈ నలుగురు దుకాణదారులు సహకరించకపోవడంతో గడిచిన నెల రోజుల నుండి 8 షాపులు రెండు వర్గాలుగా చీలికై పోటాపోటీగా మద్యం అమ్మకాల కోసం ధరలు తగ్గించటం, నేరుగా బెల్ షాప్ దుకాణదారుల వద్దకే వెళ్లి హామీలు ఇవ్వడం వంటివి కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పాత మద్యం సిండికేట్ నిర్వాహకుడు ఎమ్మార్పీ ధర కంటే రూ. 10 తగ్గించి మద్యాన్ని విక్రయిస్తుంటే ఈ పోటీ తట్టుకునేందుకు వైన్ షాపులు ఏర్పాటు చేసుకున్న వారు నేరుగా బెల్టు దుకాణం నిర్వాహకుల వద్దకు వెళ్లి మా వద్ద మద్యం కొనుగోలు చేస్తే మీ షాపును పోలీసు గాని ఎక్సైజ్ వారు గాని తనిఖీ చేయాలని హామీలు ఇస్తున్నారని సమాచారం. పోలీస్, ఎక్సైజ్ తనిఖీలు నిర్వహించరంటే వీరికి అధికారుల అండదండేలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇతర దుకాణాల వద్ద మద్యం కొనుగోలు చేస్తే ఈ రెండు శాఖల అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తారని చెప్పగానే చెబుతూ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారని బహిరంగ ఆరోపణలు లేకపోలేదు. దీంతో మద్యం అమ్మక వ్యాపారుల మధ్య రోజుకు దూరం పెరుగుతుండడంతో పాటు వివాదాలకు తలెత్తే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా ఏ షాపు వద్ద మద్యం కొనుగోలు చేస్తే ఏం జరుగుతుందోనని బెల్టు షాపు నిర్వాహకులు ఆందోళన గురవుతున్నారు.

### సేల్స్ పెంచేందుకు ఏజెంట్ల నియామకం

ఇల్లందులోని వైన్స్ షాపులు సిండికేట్ అయ్యేందుకు మార్గం లేకపోవడం వల్ల ఆయా వైన్స్ షాపుల నిర్వాహకులు వారి సేల్స్ పెంచు కోవడం తోపాటు పెట్టిన పెట్టుబడినైన ఎలాగైనా రాబట్టుకోవాలని కొత్తగా మద్యం వ్యాపారం లోకి వచ్చిన



ఏకంగా ఏజెంట్లను నియమించడం జరిగిందనే ప్రచారం జోరందుకుంది. సదరు ఏజెంట్లు బెల్ట్ షాపుల చుట్టూ తిరుగుతూ తమ షాపులోనే మద్యం కొనుగోలు చేయాలని బ్రతిమలాడుకోవడం విడ్డూరంగా ఉందని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విదంగా బెల్టు షాపుల వద్దకు ఏజెంట్లను పంపించడం కొత్త అధ్యాయానికి త్వరలో తెర లేపారనేది స్పష్టమవుతుంది.

### 20 రోజుల వరకు రూ. 10 తగ్గించి అమ్మకాలు

ఇల్లందులో సిండికేట్ కాకపోవడంతో గతంలో దశాబ్ద కాలంగా సిండికేట్ ను నిర్వహించిన నిర్వాహకులు ఎమ్మార్పీ పై రూ. 10 తగ్గించి కొత్తవారిని దారికి తెచ్చుకోవాలని ప్రయత్నించారని, డని వల్ల తాము పెద్దగా నష్టపోయేదేమి లేదని గతంలో సిండికేట్ ద్వారా వచ్చిన లాభాలను కొంతమేర ఇప్పుడు తగ్గించుకునే ప్రయత్నం చేస్తూ ఆ నిర్వాహకులను సైతం దారికి తెచ్చుకొని సిండికేట్ ను దక్కించుకొని తిరిగి కొనసాగించాలని పట్టుదలతో వారు ముందుకు వెళుతున్నారని ప్రచారం జరుగుతుంది.

### యుటర్న్ వెనుక మతలభేంటి?

మద్యం సిండికేట్ సాధ్యం కాకపోవడంతో గతంలో సిండికేట్ నిర్వహించిన వారికి వచ్చిన మద్యం షాపులలో హాలో ఎమ్మార్పీ ధరపై రూ. 10 తగ్గించి సుమారుగా 20 రోజుల పాటు అమ్మకాలు కొనసాగించారు. మరల ఏమైందో ఏమో కానీ యూటర్న్ తీసుకోవడం వెనుక ఏలాంటి మతలబు ఉందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇలా 20 రోజుల పాటు ఎమ్మార్పీపై రూ. 10 తగ్గించి, మరల ఎమ్మార్పీ రేట్లకే విక్రయించడం పలు అనుమానాలకు ఆజ్యం పోస్తుందని మందుబాబులు పేర్కొంటున్నారు.

### సిండికేట్ ను దక్కించుకునేందుకు పోటాపోటీ

ఇల్లందులో మద్యం సిండికేట్ ను దక్కించుకునేందుకు పోటా పోటీగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. గతంలో కొన్నేళ్లపాటు సిండికేట్ నిర్వహించిన వారితో పాటు కొత్తగా మద్యం వ్యాపారంలోకి ప్రవేశించిన వారు, ఎవరికి ఉన్న పలుకుబడితో వారు భారీగా లాబియింగ్ చేయడం జరుగుతుందనే ప్రచారం కొనసాగుతుంది.

### పోటీల మధ్య మద్యం నాణ్యతేనా?

ఇల్లందులో మద్యం దుకాణదారుల మధ్య నెలకొన్న సిండికేట్ వ్యవహారం వల్ల ఆయా షాపులలో విక్రయించే మద్యం నాణ్యతదేనా.. కల్తీ మద్యం ఏమైనా అమ్మకాలు జరుగుతున్నాయా అని మద్యం ప్రియులు ఆరోపణలు చేస్తున్నారు. గతంలో 20 రోజులపాటు క్వార్టర్ ఎమ్మార్పీ పై రూ. 10 తగ్గించి అమ్మడం, మరల ఎమ్మార్పీ నే కొనసాగించడం పట్ల ఎప్పుడు ఎలాంటి వార్త వినాలోనన్న ఉత్కంఠగా మందుబాబులు ఎదురుచూస్తున్నారు. ఏది ఏమైనా ఇల్లందులో మాత్రం సిండికేట్ కాకుండానే వైన్స్ షాపుల్లోనే మద్యాన్ని విక్రయిస్తేనే అన్ని రకాల బ్రాండ్లు దొరుకుతాయని, సిండికేట్ గా ఏర్పాటు అయితే మద్యం ప్రియులు అధికంగా సేవించే అన్ని రకాల బ్రాండ్లను బెల్టు షాపులకు తరలిపోవడం వల్ల మద్యం ప్రియుల జేబులకు భారీగానే చిల్లుపడే ప్రమాదం లేకపోలేదు. సిండికేట్ కాకపోవడమే మంచిదని, వైన్స్ లలోనే అమ్మకాలు ఉంటేనే బాగుంటుందని మందు బాబులు కోరుకుంటున్నారు.